పడకకుర్చీలో చేర్లబడి తీరుబడిగా పేపరు చదువుకొంటున్న రాజా రావు వాకిట్లో అడుగుల చప్పుడు వినబడి, తలెత్తి, రవణ నెత్తుకొని వస్తున్న మామగారిని చూస్తూనే ఆశ్చర్యపోయాడు. తన ప్రథమ కళత్రం సరళ పోయాక ఆయన తన ఇంటికి రావడం ఇదే ప్రథమం.

ఈ మూడేళ్లలోను ఆయన బెజవాడ అసలు రాకపోలేదు. కాని, తన ఇంటికి మాత్రం రాలేదు. ఆ మాటే ఒకసారి ఆయనతో చూచాయగా అంటే, "నే నక్కడికి రాలేను. ఏమీ అనుకోబోకు, నాయనా!" అని కళ్లు తుడుచుకొన్నప్పుడు మరిక తనేమీ అనలేకపోయాడు. అల్లాంటి రాఘవయ్యగారు ఈవేళ ఎందుకు వచ్చినట్లు? పైగా, రవణను తీసుకొని? ఆలోచనల్లోంచి తేరుకొంటూ ఆహ్వానించాడు మామగారిని.

కుర్చీలో కూర్చుంటూ 'ఉస్సు'రని నిట్టూర్చారు రాఘవయ్యగారు.

''మీ బాబయ్యగారికి కాళ్లు కడుక్కునెందుకు నీళ్లు తీసుకురా, సీతా!" అని కేక వేశాడు రాజారావు. సీత రాజారావుకి ద్వితీయం. సీతకు కూడా రాఘవయ్యగారు రావడం ఆశ్చర్యంగానే ఉంది. చెంబుతో నీళ్లు కుర్చీ దగ్గరగా పెడుతూ "అందరూ కులాసాయేనా అండీ?" అని అడిగింది.

"ఆ ఆ కులాసాయేనమ్మా!" అంటూ నీళ్లు అందుకున్నారు రాఘవయ్యగారు.

జవా బందుకొని లోనికి వెళ్లిపోయింది సీత.

మామగారిని పరామర్శించి మళ్లీ పేపర్లో మునిగిపోయాడు రాజారావు ముసలాయన మనమడి యక్ష ప్రశ్నలకు ఓపిగ్గా



జవాబిస్తున్నాడు.

"ఈ ఇల్లెవరిది, తాతా? ఇక్కడి కెందుకు కొచ్చాం?" అని అడుగుతున్న రవణకి, "ఇది మీ ఇల్లే, బాబూ! ఆయన మీ నాన్న! మర్చేపోయావా? అప్పుడు నీకు జ్వరం వచ్చినప్పుడు బిస్కట్లు తెచ్చిపెట్టలే?" అంటూ జ్ఞాపకం చెయ్యబోతున్నారు తాతగారు.

ఆ మాటలు విన్న రాజారావుకి పేపర్ మీద మనసు నిలవలేదు. ఆలోచనలు వెనక్కి పరిగెట్టాయి.

సరళని చేసుకున్న నాలుగేళ్లకి రవణ పుట్టాడు. కాని, సరళ పురిట్లోనే కన్ను మూసింది. పోతూ రవణని చూపించి, "జాగ్రత్తగా చూస్తారు కదూ!" అని మాత్రం చెప్పింది అంతే కాని, తనా మాట నెరవేర్చలేకపోయాడు. మొదట్లో రవణని తన వద్దే ఉంచు కొందా మనుకొన్నాడు కాని, తన కాపరం మళ్లీ ఒక రూపానికి రాకముందే ఆ రోజుల శిశువుని పెంచడం

ఎలాగా అని ఆలోచించాడు. అందుకనే సరళ పోయిన పదకొండో రోజున అత్తగారూ, మామగారూ వెళ్లిపోతూ రవణని తమ వెంట తీసుకువెడతామని అడిగినప్పుడు తనేమీ అభ్యంతరం పెట్ట లేదు.

ఆ తరవాత రెండు నెలలకే అక్కయ్య ప్రోత్సాహంతో సీతని వివాహం చేసుకుని ఇంటికి తెచ్చుకున్నాడు.

ఆ తరవాత తీసుకొద్దామని అనుకున్నా 'సీతకు కొత్తగదా, కొన్నాళ్లాగుదాం!' అని ఊరుకున్నాడు.

నెమ్మదిగా వాడు ఇక్కడకన్నా అక్కడ ఉంటేనే మంచిదన్న ఊహలో స్థిరపడి పోయాడు.

సీతను చేసుకున్న ఈ మూడేళ్లలోనూ సరళను మరిచిపోయాడనే చెప్పొచ్చు, అప్పుడప్పుడూ రాఘవయ్యగారు రాసే ఉత్తరాలలో రవణ సంగతి చూసినప్పుడు తప్ప అప్పుడు మాత్రం మనస్సు కలుక్కుమనేది, పాతజ్ఞాపకాల తిరగవేతతో.

రవణని తీసుకువెళ్లాక ఈ ముడేళ్లలో రెండు మూడు సార్లు మాత్రమే అత్తవారింటికి తాను వెళ్లాడు – అదైనా అత్యవసర మరిచిపోయాడనే మైనప్పుడే.

ఆరు నెలల క్రితం రవణకి జ్వరంగా ఉన్నదని రాఘవయ్యగారు ఉత్తరం రాసినప్పుడు వెల్లాడు. తాను వెళ్లిన రెండు రోజుల్లోనే జ్వరం తగ్గిపోయింది. తనక్కడ ఉన్న నాలుగు రోజులూ రవణ తన దగ్గరకు రానేలేదు. అందరూ తనని చూపించి, 'మీ నాన్న దగ్గరకు వెళ్లు' అని తోసి పంపించాలని చూసేవాళ్లు కాని, వాడు లొంగలేదు. తనూ అంత చనువు తీసుకోవాలని ప్రయత్నించ లేదు – అదో బంధం కింద తయారవు తుందనే భయంచేత. సరళ కిచ్చిన మాట తానే విధంగా చెల్లించినట్లు? రవణని చూడగానే సరళ జ్ఞాపకం వచ్చి కళ్లు చెమర్చాయి రాజారావుకి.

పేపరద్దు తీసి, "రా, బాబూ!" అంటూ రెండు చేతులూ చాపాడు. రవణ రాలేదు. తాతకి మరింత అతుక్కుపోయాడు. చేతితో దగ్గిరకు లాక్కోబోయాడు రాజారావు. కెవ్వున కేక వేసి తాతని చుట్టేసుకున్నాడు రవణ.

రవణని సముదాయిస్తూ, "కొత్తగదూ, నాయనా! కొన్నాళ్లు పోతే వాడే వస్తాడు!" అన్నారు రాఘవయ్యగారు.

రాత్రి భోజనాల దగ్గర తను వచ్చిన కారణం కదలేశారు రాఘవయ్యగారు.

"చూడు, బాబూ! నే నొచ్చిన సంగతేమిటంటే..." రవణని చూస్తూ మాట ఆపారు. ఏమిటన్నట్టు తలెత్తి చూశాడు రాజారావు. నెయ్యి వడ్డిస్తున్న సీతకూడా ప్రశ్నార్థకంగా చూసింది.

"మూడేళ్లు దాటింది కదూ వీణ్ణి తీసుకెళ్లి...?" అంటూ రవణ వేపు చూశారు రాఘవయ్యగారు.

"అవును" అనేసి అన్నం కలుపు కుంటున్నాడు రాజారావు

ఆ సంగతులు సీత ముందు చర్చించడం ఇష్టం లేదు రాజారావుకి.

సరళతో కాపరం చేసినన్నాళ్లూ తనదే పై చేయిగా నిభాయించుకు వచ్చాడు రాజారావు. అందుకు తగ్గట్టు సరళ చాలా మెతక. అతని పట్ల చాలా అణకువగా ప్రవర్తించేది.

సీత కాపరానికి వచ్చిన కొన్నాళ్లకే సరళా, ఈమే ఉత్తరధ్రువం, దక్షిణ ధ్రువం అని గ్రహించుకున్నాడు. నెమ్మది మీద దారికి వస్తుందిలే అని మొదట్లో ఆమె మాటే నెగ్గనిస్తూ వచ్చాడు. రానురాను సీత తన చలాకీతనంతో అతన్ని లొంగదీసుకుంటూ వచ్చింది. అదీగాక జీవితంలో ఒక దెబ్బ తిన్న రాజారావు ఆమె ఆగ్రహంకాని, విచారం కాని చూడలేకపోయేవాడు.

ఫలితం – అన్ని విషయాల్లోను ఆమెదే పైచేయి అయింది.

ఇప్పుడు సీత ముందు వెనకటి భార్యాబిడ్డల ప్రస్తావన ఎత్తుకుంటే ఆమె మన సెక్కడ నొచ్చుకుంటుందో అని భయపడ్డాడు రాజారావు.

ఇవేవీ గమనించలేదు రాఘవయ్యగారు. "అమ్మాయి పోవడంతోనే అనలే అర్ధనాకారందేమో మరీ నీరస పడిపోయింది మీ అత్తగారు. ఓ ఏడాది ఎలాగోలా అవస్తపడి వీణ్ణి పెంచుకొచ్చాము ఇక ఆ తరవాత లాభం లేకే మా పెద్దాడికి వయస్సు రాకపోయినా పెళ్లి చేసి కోడల్ని ఇంటికి తెచ్చుకున్నాము. నీకు తెలుసు కదూ, నాయనా!"

తల ఊపాడు రాజారావు–ఎందుకో ఈ ఉపోద్ఘాతం అనుకుంటూ.

"ఈ రెండేళ్ల బట్టి బాగానే జరిగిపోతూ వచ్చింది. కాని, కోడలు కడుపున ఓ కాయ కాసిన దగ్గర్నించీ కష్టం అయిపోతూంది. 'నా పిల్లనే చూచుకోనా? వీడికే చెయ్యనా?' అని కోడలు వీణ్ణి అంతగా పట్టించుకోవడం లేదు. కోడలి నేమీ అనలేక మీ అత్తయ్య అనారోగ్యంతో బాధపడుతూ, అలాగే

చేసుకొనస్తాంది ఇన్నాళ్లూను పదిహేను రోజుల కిందట దానికి జ్వరం వచ్చినప్పుడు, ఆ వారం రోజులూ వీడి మొహం ఎవ్వరూ చూడ్డానికి లేకపోయారనే చెప్పాలి.

"మాకూ రోజులు ముందుకు వస్తున్నాయి గాని వెనక్కు పోవడం లేదుకదా! ఏ రోజున మంచాన పడతామో మాకే తెలీదు. ఆ తరవాత వీణ్ణి వాళ్ల చేతుల్లోనూ, వీళ్ల చేతుల్లోనూ పడెయ్యటం నా కిష్టం లేదు. ఈ వయస్సులో సరియైన పోషణ లేకపోతే ఎందుకూ కొరగాడు. అందుకనే నీ దగ్గర దిగవిడిచి పోదామని వచ్చాను, బాబూ! మాతోపాట నీవుకూడా వాడి మేలు కోరే వాడివి కదా!" అని ముగించారు రాఘవయ్యగారు.

గుండెల్లో రాయి పడింది రాజారావుకి అక్కడికీ "వాడికి మా దగ్గర చనువు లేదుకదండీ!" అని నసిగాడు.

"చనువుకేం, నాయనా! కొన్నాళ్లు పోతే అదే వస్తుంది. వాడు ఒక్కడూ నాకు బరువై వదిలి వెళ్లడం లేదు, బాబూ! నమ్ము - నమ్మకపో, అమ్మాయి పోయినా వీడిలో దాన్ని చూసుకుంటూ సగం దుఃఖం మరిచిపోతున్నా మనుకో కేవలం వీడి బాగుకోసమే వదిలి పెడతున్నానిక్కడ. ఆ పైన నీ ఇష్టం!"

కూతురు జ్ఞాపకంతో ఆఖర్ని ఆయన గొంతు బొంగురుపోయింది.

మరిం కేమి అనలేకపోయాడు రాజారావు.

తెల్లవారుజామునే ప్రయాణమయ్యాడు రాఘవయ్యగారు.

"కాఫీ తాగి వెడుదురుగాని..." లాంఛనంగా అన్నాడు రాజారావు.

"కాదులే, బాబూ! వాడు లేస్తే నన్ను కదలనివ్వడు" అంటూ సీత కేసి చూస్తూ

"చూడమ్మా, తల్లి లేని పసివాణ్ణి నీ చేతుల్లో పెడుతున్నాను. నువ్వూ నా బిడ్డవంటి దానివే. వాణ్ణి నీ బిడ్డలా చూసుకోమ్మా!" మరి మాట్లాడ లేక కళ్లు కండువాతో అద్దుకుంటూ చేతిసంచీ తీసుకుని బయలుదేరారు రాఘవయ్యగారు.

నిద్రమత్తు వదలని సీత ఆవులిస్తూ మళ్లీ వెళ్లి పడుకుంది.

మామగారు కనుమరుగయ్యేదాకా చూసి భారంగా నిట్టూర్చి తలుపువేశాడు రాజారావు.

తెల్లారి లేస్తూనే పక్కన తాత లేకపోవడంతో ఏడుపు అంకించుకున్నాడు బాబు. కాస్సేపుదాకా వాడే ఊరుకుండా దనుకున్న సీత రవణ రాగం పెంచేసరికి లేవక తప్పలేదు.

దగ్గరికి వెళ్లి మొహం చిట్లించి "ఎందుకలా ఏడుస్తావు?" అని కసిరింది.

"తాత" అన్నాడు రవణ బిక్క మొహం వేసి.

"ఒస్తాళ్లే మీ తాత. లే, పక్క ఎత్తాలి."

బాబు లేవలేదు. పైగా, మరి కాస్త రాగం హెచ్చించాడు.

ఒళ్లు మండిపోయింది సీతకి ఒక్కటి వేసింది. గొల్లుమన్నాడు రవణ.

ఇదంతా మొదటినించీ గమనిస్తూనే ఉన్నాడు రాజారావు. ఇంక కలగజేసుకోక తప్పలేదు. "కొట్టకు, సీతా! బెదిరిపోతాడు. నెమ్మదిగా చెబితే వాడే వింటాడుగా!" అన్నాడు సామనయంగా.

రుయ్యిమని లేచింది సీత. "మీకు తెలియదు ఊరుకోండి. ముందు నుంచీ అలుసిస్తే ఆ పైన నెత్తినెక్కి సవారి చేస్తాడు!" రుసరుస లాడింది. అప్పుడే అయిందీ?

మరి మాట్లాడలేదు రాజారావు. ఇలాంటివి ఎన్ని చూడాలో?

రవణని పక్కమీంచి బరబర లాగి, కింద కుదేసి, పక్క ఎత్తింది. వాడలా ఏడుస్తూనే ఉన్నాడు. తన మానాన తన పని తాను చేసుకుపోయింది సీత.

తన వేపు చూస్తూ ఎత్తుకోమని చేతులు చాచి ఏడున్తున్న రవణని దగ్గరకు తీసుకోవాలని రాజారావు హృదయం తహతహలాడింది. కాని, సీతతో మళ్లీ ఎక్కడ ఘర్షణ పడాల్సివస్తుందో నన్న భయంతో అక్కణ్ణుంచి మెల్లిగా తప్పుకున్నాడు.

ఇంకా ఏడుపు మానని రవణ కేసి కళ్లెర్ర చేసి చూసింది సీత అప్పటిదాకా, నిన్న తాత తన 'నాన్న' అని చెప్పిన మనిషి తనకు అండగా ఉంటాడని ఆశించిన రవణకి, ఆ ఆశ అడుగంటడంతో బిక్కమొహం వేసి ఏడుపు మానక తప్పలేదు.

ఏదో సాధించినంత గర్వం వచ్చింది సీతకి.

దొడ్లోకి తీసుకువెళ్లి, వాడి చేతిలో ఇంత పళ్లపొడి వేసి; "పళ్లు తోముకో!" అన్నది.

"నాకు రాదు" అన్నాడు రవణ భయంగానే.

"మరేమి వచ్చు-తినటం ఒచ్చా? రాదట రాదు - తోముకో!" గద్దించింది సీత.

"రాదంటే-" భయపడుతూనే ఎదిరించాడు రవణ

"తోముకో! అదే వస్తుంది." విసుగొచ్చింది సీతకి.

"నువ్వు తోము."

"ఏమిటీ? నేను తోమాలా? నేనేం పనిమనిషిని కాను నీకు సేవ చెయ్యడానికి" దెప్పుళ్లంటే అర్థంకాని పసివాణ్ణి దెప్పి పొడిచి కసిగా ఆనందించింది సీత.

"ఏమండోయ్, మిమ్మల్నే! మీ కొమారుడికి పళ్లు తోమాలట. ఈ పనులన్నీ నే చెయ్యలేను. అవసరమైతే మీరే చేసుకోండి!" మొగుణ్ణొక్క కేక పెట్టి, సణుక్కుంటూ ఇంట్లోకి వెళ్లి పోయింది సీత. ఇదంతా చూస్తున్న పనిమనిషికి జాలి వేసి, పళ్లు తోమి మొహం కడిగించింది ఆవేళ్టికి.

రాత్రి భోజనాలయాక తమలపాకుల పళ్లెంతో పక్కకి జేరిన భార్యతో లాలనగా అన్నాడు రాజారావు.

"సీతా! నీకో మాట చెప్తాను, వింటావా?"

ప్రసన్నంగా ఉన్న సీత మొహం ఒక్కసారాగా ముకుళించుకుపోయింది.

"నాకు తెలును - మీ కొడుకు విషయమేగా" అంది కరుగ్గా.

"అదిగో, అదే వద్దు నీ - నా అన్న బేదం మానేసి వాడివంక ఒక్కసారి చూడు అమాయికంగా నిద్రపోతున్న వాడి మొహం ఎంత ముద్దుగా, అందంగా ఉందో! ఎంత మందికి ఇంత చక్కని పిల్లలున్నారంటావు? నిజం చెప్పు! నీకు కాస్త ఎడమవబట్టి గాని ఈ పాటికి మన కో పావ ఉండేది. కాదంటావా? ఆ పాపే వీడనుకోగలిగితే మనకు వీడు అంత భారమనిపిస్తాడా? నా మాట విను, సీతా! ఇరుగు పొరుగుల్లో కూడా నీవు సవతితల్లిగా వాళ్ల నోళ్లలో నానడం మంచిదంటావా?" అంటూ నచ్చచెబుతూ బుజ్జగించాడు.

సీత మనసులోనే భర్త మాటల్ని సమీక్షించుకుంటూ సాలోచనగా రవణవంక చూసింది.

నిజమే రవణ పచ్చగా, బొద్దుగా, బంతిలా ఉన్నాడు.

సవతి బిడ్డ అన్న ఆలోచన మొదలబట్టి కాని, అదే మరొకరి పిల్లవాడయి ఉంటే, బుగ్గలు చిదిమి భుజాన వేసుకునేదే తాను.

భార్య మొహంలో వచ్చిన మార్పును చూస్తూ తృప్తిగా నిట్టూర్చాడు రాజారావు.

మరునాటి నుంచీ సీత వైఖరిలో వచ్చిన మార్పు చూసి పనిమనిషే ఆశ్చర్యపోయింది. అంత గృహకల్లోలం సులభంగా సద్దుమణుగుతుందని ఆశించని రాజారావు ఆనందం అంతా ఇంతా కాదు.

స్వతహాగా ఎవరూ కఠినులుగానూ, దుర్మార్గులుగానూ పుట్టరు. పరిస్థితులే వారినలా వంచుతాయి. సీతకూడా అంతే. పానకంలో పుడకలా తమ దంపతుల మధ్య అడ్డొస్తున్న ఆ పసివాణ్ణి చూసినప్పుడు మొదట్లో కాస్త కంటగింపుగానే ఉన్నా, లోకానికి వెరిచి కొంతా, రవణ ముద్దుమాటలకీ, చిలిపి చేష్టలకీ మురిసికొంతా తన అక్కస్సు చాలా వరకూ తగ్గించుకో గలిగింది.

ఇవేమీ పట్టని రవణ కొన్నాళ్లలోనే తల్లికి, తండ్రికి మాలిమైపోయాడు. రాజారావు, సీతకూడా వాణ్ణి బాగానే గారాబం చేస్తున్నారు. మొదటి రోజున చెవులు కొరుక్కున్న అమ్మలక్కలకు మళ్లీ ఆహారమేమీ దొరక్క చల్లబడి ఊరుకున్నారు, పాపం.

రెండు నెలలు గడిచాయి. హఠాత్తుగా సీతకు గుర్తు వచ్చింది-వాయిదాల పద్ధతిమీద కొనబోతున్న తన నెక్లెసుకు డబ్బు కడుతున్నారా, లేదా అని. కూరలు తరుగుతున్నదల్లా ఆదరాబాదరా లేచి, ముందు గదిలో ఉన్న భర్త దగ్గర వాలింది.

"ఏమండీ! క్రిందటి నెలా, ఆ పై నెలా నా నెక్లెస్ వాయిదాలు కట్టేరా?" అని ప్రశ్నించింది అదాటుగా.

ఆఫీసు ఫైల్సు సరిచేసుకుంటున్న రాజారావు "లేదుగా?" అన్నాడు తాపీగా "ఎందుకని?" అతని నిర్లక్ష్యానికి కోపం ముంచుకొచ్చిన సీత రెట్టించింది

భార్య ఆగ్రహానికి రాజారావు కొంచెం బిత్తరపోయాడు. "ఎందుకేమిటి? ఒ నెల రవణకి బట్టలు కొన్నామా! క్రిందటి నెల నువ్వేనా హార్లిక్సూ, బిస్కట్లూ, స్వీట్సూ తెమ్మన్నావు? అవిగాక నేను బూట్లూ, ఏవో కొన్ని బొమ్మలూకూడా తెచ్చానా మరి? అవన్నీ ఊరికే వచ్చాయనుకుంటున్నావా?" ఫైల్సు సర్దడం ఆపుచేసి మెత్తగా నవ్వాడు భార్య కెలా సద్ది చెప్పాలా అని ఆలోచిస్తూ.

"మరి నా నెక్లెస్?" అన్నది సీత బిక్కమొహం వేసి.

"అబ్బే! రెండు నెలలదీ కలిపి ఈ నెల కట్టేయ్యనూ! ఈ నెల 'లోన్' తీసుకుంటు న్నానుగా" అంటూ సముదాయించాడు భార్యని.

అప్పుడే పక్క ఇంట్లో ఆటలాడి ఇంటికి వస్తున్న రవణని చూస్తూ "వీడి మూలాన. ." అంటూ ఏదో వెళ్లగ్రక్కపోయిన సీత,

అంతలోనే సంబాళించుకుని, "సరేలేండి" అని లోపలికి వెళ్లిపోయింది.

రవణ రాకతో రాజుకున్న అసంతృప్తి ఎప్పటికప్పుడు తాత్కాలికంగా నివురు కప్పుకుంటున్నా, అప్పుడప్పుడు ఇటువంటి సుడిగాలులకు రేగి నిప్పురవ్వలు బయటపడుతూనే ఉన్నాయి. రాబోయిన తుఫాను ఆగిపోయినందుకు తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు రాజారావు.

ఆ తరవాత కొన్నాళ్ల వరకూ రవణ విషయంలో సీత ముభావంగా మసులుకోవడం గమనించాడు రాజారావు. ఆ నెల తీసుకున్న లోనుతో నెక్లెను మీదుగా రేగిన గాలిదుమారం అణిచేద్దామనుకున్నాడు.

ఇంతలోకే రవణకి ముంచుకొచ్చింది. ఒకనాడు ఆడుతూ పాడుతూ ఉన్న వాడల్లా ఒక్కసారి బిగుసుకుపోయాడు రవణ. భార్యాభర్తలిద్దరూ బెంబేలు పడిపోయారు. డాక్టర్ల కోసం పరుగెట్టి, 'వాణ్ణి దక్కించుకున్నాం' అనుకుని పారచూచుకునే వేళకు 'లోను' వంద రూపాయలూ కాక మరో ఏభై రూపాయలు అప్పు తేలింది.

కాని, విశేషమేమంటే, దీనికి సీత ఏ మాత్రమూ బాధపడలేదు. రవణకి సుస్తీ చేసిన పదిహేను రోజులూ తిండీ తిప్పలూ మాని వాడికి సేవ చేసింది. వాడికి తగ్గితే చాలని వెయ్యి దేవుళ్లకు మొక్కింది.

శ్రావణ మాసానికి అమరుతుందను కున్న నెక్లెసు వెనక్కుపోతుందేమో అని మొన్నటివరకూ గొణుకున్న సీత, నాలుగు నెలల బట్టి సొమ్ము కట్టక పోయేసరికి, లిస్టులోంచి తొలగించారని భర్త చెప్పినా చలించలేదు. "పాడు నెక్లెస్ లేకపోతే లేకపోయింది లెండి. బిడ్డ దక్కాడు అంతే చాలు!" అన్నది తృప్తిగా. ఆశ్చర్యపోయాడు రాజారావు.

స్త్రీలో ఉన్న మాతృత్వపు చైతన్యం అదే! ఆ సున్నితమైన ప్రకృతి దేనికి ఎప్పుడు స్పందిస్తుందో చెప్పలేము.

రవణ మళ్లీ కోలుకుని ఆటల్లో పడేవరకూ సీత పడ్డ ఆరాటం చెప్ప నలని కాదు. టానిక్కులని, పాలనీ, పథ్యమనీ రాజారావుని ఊపిరాడ నిచ్చేదికాదు. రవణకి సుస్తీ చెయ్యడం కూడా మంచికే జరిగిందనుకున్నాడు రాజారావు. సీతంటే అపేక్ష పెరిగిందతనికి.

సీతకు నెల తప్పింది. "చూశావా, రవణ వచ్చిన వేళావిశేషం!" నవ్వుతూ కళ్లెగరేశాడు రాజారావు. రవణ వంక ప్రేమగా చూసింది సీత.

నీరసంగా ఉన్నందున సహాయంగా రమ్మనమని తల్లికి రాసింది సీత. ఆమెకు రావడానికి వీలుకాక, సీత మేనత్త సూర్యకాంతమ్మను పంపించింది. ఆవిడ తల చెడి అన్నగారింటనే ఉంటూంది.

వస్తూనే ప్రారంభించిందావిడ. "అదేమే, నా తల్లీ అలా పాలిపోయావు! చెక్కిళ్లెంత నల్లబడిపోయాయో! అద్దంలో ఓ సారన్నా చూసుకున్నావటే?" అంటూ తోసుకుపోయిన దవడల్ని మరింత లోనికి నొక్కుకుంది.

"నువ్వెప్పుడూ అలాగే అంటావత్తయ్యా!" నవ్వింది సీత. సీతని చిన్నప్పటినించీ ఆవిడే పెంచింది.

"ఈ మాటు అలా అంటే ఒప్పుకోను సుమా! పచ్చగా, దుబ్బుగా జబ్బ పట్టకుండా ఉండేదానివి! ఎలా ఆర్చుకుపోయి కావిరంగు పడిపోయావో తెలుసా?" అని నిట్టూర్చి, "నీళ్లోసుకున్న దానివి ఇప్పుడే ఇలా ఉంటే రేపు కన్న తరువాత ఇంకెలా తయారవుతావో?" అంటూ వాపోయిం దావిడ.

సాయంత్రం జడ వేసుకుంటూ అద్దంలో మొహం పరీక్షగా చూసుకున్నది సీత. కళ్లకింద ఏర్పడ్డ నల్లని వలయాల్ని తడుముకుంటూ, 'నిజమే, మొహంలో కళా, కాంతీ కూడా తగ్గినై' అనుకుంది భారంగా.

తెల్లారింది. సీత రవణకి హార్లిక్సు కలుపుతూంది.

"నీకేనా?" అన్నదావిడ.

"ఊహుఁ. రవణకి నేను కాఫీ నే తాగుతాను."

"బాగుంది. దుక్కలా తిరుగుతున్న వాడికి హార్లిక్సులూ, టానిక్కులూనా? బాగుందమ్మా బాగుంది!" మూతి విరుచుకున్న దావిడ.

"అబ్బే! మొన్ననే బోలెడు సుస్తీ పడి లేచాడత్తయ్యా! అసలు బతకడనుకున్నాం." వివరించబోయింది సీత.

"అయ్యో పిచ్చికొయ్యా! ఇలాంటి వాళ్లు చవ్వున చస్తారంటే, ఎంత మంది ఆయుస్సున్ని పోసుకు బతుకుతారు గానీ?" చేతులు తిప్పుతూ బోధించబోయింది కాంతమ్మ.

"ఊరుకో, అత్తయ్యా! ఆయన వింటే బాగుండదు."

ఆవిడ ధోరణి ఇంకా ఎంత సేపు అలవెల్లువకింద సాగేదో కాని, సీత ఆనకట్టవేసి వారించింది అప్పటికి.

భోజనాల దగ్గర రాజారావుని వదిలి

పెట్టలేదు సూర్యకాంతమ్మ. "అమ్మాయిని చూశావా నాయనా! ఎలా చిక్కిపోయిందోనూ? నే నా మాటంటే లేదని తలాయిస్తూంది అది!"

"మరేనండీ! రవణకి జబ్బు చేసినప్పుడు నానా హైరానాపడి విధీ విరామం లేకుండా చాకిరీ చేసింది అప్పట్నించీ కోలుకొనేలేదు" అన్నాడు సానుభూతిగా.

"మరి దాని కేమన్నా మందూ మాకూ ఇప్పించద్దా? నీళ్లోసుకున్న పిల్ల కదా, ఒంట్లో సత్తున లేకపోతే రేపు కాన్పు కష్టం కాదా?" ఆమాత్రం తెలీదా అన్నట్లు మొహం పెట్టింది సూర్యకాంతమ్మ.

"మరే-మరే నేను మరిచేపోయానండీ! రేపు డాక్టరుకి చూపించి మందులు రాయిస్తాను." తన అజాగ్రత్తకి సిగ్గు పడ్డాడు రాజారావు.

మేనత్త కనబరిచే మమకారానికీ, శ్రద్ధకీ సీతకు ఆవిడంటే అభిమానమే. అనిడున్నన్నాళ్లూ సీతని ఒక్క పని ముట్టనిచ్చేది కాదు. సీతకు మనసయినవన్నీ అడిగి మరీ చేసి పెట్టేది. వల్లమాలిన ప్రేమతో చూసే దావిడ సీతను నిజానికి.

కాని, అదే కారణంగా రవణంటే పడేది కాదావిడకు. 'లోకంలో సవితిబిడ్డ అంటే కళ్లలో నిప్పులు పోసుకుంటారు. కాని, ఇదెక్కడి విడ్డూరం? వాడి కోసం ఇది బెంగ పెట్టుకుని చిక్కి సగమవటం!' అనుకునే దావిడ.

రాజారావు బజారునుంచి ఏ మిఠాయో తెచ్చి వాడికి పెట్టబోయినా, సీతకని ప్రత్యేకంగా చేసిన పిండివంట సీతే పిలిచి మరీ వాడికి తినిపిస్తున్నా, "ఊం,ఊం, మేపండి-మేపండి, తిన బుట్టాడు మరి!" అని సణుక్కునేది.

ఏ ఆటల్లోనో దెబ్బ తగిలి ఏడుస్తుంటే "ఏం నాన్నా!" అని ఎవరు దగ్గరకు తీసినా, "ఏమి అబ్బరమే, మామ్మా!" అంటూ ముక్కుమీద వేలు వేసుకునేది. వాడికి ఏమి చెయ్యబోయినా 'ఏమి సుతారాలమ్మా? అనో, 'ఆ చాకిరీతోనే నువ్విలా తయారయ్యా'వనో, 'నీకిప్పుడు తెలియదులే....' అంటూనో దెప్పి పొడిచేది.

ఆవిడ మాటలు పట్టించుకోకుండా ఉండాలనే ప్రయత్నించింది సీత.

రెండు నెలలు ఉండి, వెడుతూ వెడుతూ "కడుపు పండిన పిల్లవి. ఆ తల్లిని పొట్టను పెట్టుకున్న వెధవనలా నెత్తి నెక్కించుకోడం నాకేం నచ్చలేదమ్మాయ్! అయినా నీకు లోకానుభవం లేదు అమ్మాయ్! పెద్ద కొడుకు తలకెత్తుతాడని మీ ఆయన అనుకుంటే అనుకోగాక! గుర్తుంచుకో నువ్వెంత చేసినా వాడికి మాత్రం నువ్వు సవితితల్లివే సుమీ!" అంటూ ఓ నిప్పురవ్వ వేసి నిష్క్రమించింది.

మేనత్త వెళ్లిన తరవాత మళ్లీ ఇంటిచాకిరీ నెత్తిన పడింది సీతకి. అలవాటు తప్పిన పనులు చెయ్యబోతే, అంతకు కొంత విసుగ్గానే ఉంటూంది.

పచ్చిగా ఉన్న పుండు రేగినట్టు ఈ మధ్య రవణని కసురుకుంటున్నది సీత. ఒక్కొక్కసారి దెబ్బలుకూడా పడుతున్నాయి వాడికి. ఎన్నడూ లేనిది రాజారావు ఆఫీసు నుంచి రాగానే రవణ చేసిన అల్లర్లు పొల్లు పోకుండా చెప్పుకువస్తూంది. సీతలోని మార్పు అతను కనిపెట్టలేదు. 'మరీ అల్లరి వెధవై పోతున్నాడు వీడు' అనుకున్నాడు.

అప్పట్లోనే రాజారావుకి ప్రమోషను వచ్చింది. జీతం కూడా ఏమాత్రమో పెరిగింది.

ఓనాడు మాటల సందర్భంలో యథాలాపంగా అడిగాడు రాజారావు.

"జీతం పెరిగింది కదా! రవణ పేర ఇన్సూరెన్సు కడదామా? రేపు వాడి చదువుకు తడుముకోకుండా వెళ్లమారుతుంది" అన్నాడు.

"మీ ఇష్టం" అన్నది సీత, అప్పటికి నిర్లిప్తంగా.

ఆ సమయంలో రాజారావు రవణ కోసం పడుతున్న ఆరాటం చూసిన సీతకి ఎక్కడలేని మాత్సర్యం పుట్టుకొచ్చింది. తన వరకే పరిమితం కావాలనుకునే భర్త ప్రేమానురాగాలు మరొకరి వరం అవుతున్నాయన్న ఊహ ఆమెకు గొడ్డలి పెట్టుగా తయారైంది. ఇప్పటివరకూ రవణమీద తెచ్చిపెట్టుకున్న అభిమానం కాస్తా క్రమేణా ఇగుర్చుకుపోతూంది.

ఎంత వద్దనుకున్నా ఉక్రోషంతో కూడుకున్న ఆలోచనలు ముసురుకుంటు న్నాయి సీతకి. 'ఔను. రవణకి ఈ ఇంట పెద్దకొడుకు హోదా అమరుతూంది- మరి తన బిడ్డలకో? అత్తయ్యన్న మాటల్లో అబద్ధమేముంది? రవణ ముందస్తిగా తమ రెక్కల కష్టమంతా జుర్రుకుని నిలబడతాడు. ఆడుతూ పాడుతూ, ఆఖర్న తానూ, తన బిడ్డలూ వాడి మోచేతి నీళ్ళ తాగాల్సిందేగా?'

రోజులు గడుస్తున్నాయి. నెలలు నిండిన కొద్దీ ఆయాసంగా ఉన్నదంటూ, రవణ పోషణంతా చాలా వరకూ భర్త మీద

పడేసికూడా, అంతా తనే చేస్తున్నట్టు బాధపడుతూంది సీత. తను వాణ్ణి పెంచడం కోసం ఎంత అవస్థ పడుతున్నదీ భర్తతోనూ, ఇరుగుపొరుగు వాళ్లతోనూ చెప్పుకుని వాళ్ల సానుభూతి సంపాదిస్తూంది.

ఇదంతా రాజారావు చూసీచూడనట్లు పోతున్నాడు. అతనికి సీత వైఖరి బోధపడటం లేదు. సీత మళ్లీ మొదటికి వచ్చిందను కోడానికి నమ్మశక్యంగా లేదు.

రెండు నెలలు గడిచాయి. రవణ బాగా చిక్కిపోయాడు. తల్లి అంటే విపరీతమైన భయం పట్టుకుంది వాడికి. వాడిని చూస్తే చాలు కారణం లేకపోయినా తిడుతూంది. వంక దొరికితే కొడుతూంది. అందుకే ఆమెను తప్పించుకు తిరగాలని ప్రయత్నిస్తున్నాడు. తండ్రి ఉన్నప్పుడు నిద్రవేళలప్పుడూ తప్ప మిగతా సమయమంతా ఇరుగు పొరుగు ఇళ్లలోనే గడుపుతున్నాడు. అదికూడా ఓ తప్పుగానే ఉంది సీతకి.

రాజారావు పైకి ఏమీ అనలేక మథనపడుతున్నాడు.రవణ మీద ఏ కాస్త ఆపేక్ష చూపించబోయినా మండిపడుతున్నది సీత. అతని మీద కోపమంతా ఏ వంక మీదో రవణ వంటి మీద చూపిస్తూంది. అందుచేత తాను కూడా వాడి విషయంలో ముభావంగా ఉండపోవాల్సి వస్తూంది.

ఒకటి, రెండు సార్లు రవణని చూడ్డానికి వస్తానని మామగారు రాసినప్పుడు ఇక్కడికి వస్తే వాడి పరిస్థితికి ఆయన ఏమనుకుంటాడో అని, ఇప్పట్లో ఆయన్ని రావద్దనీ, ఇప్పుడిప్పుడే తాతయ్యనీ, అమ్మమ్మనీ మరిచిపోతున్న రవణ తిరిగి గుర్తు తెచ్చుకుని బెంగపెట్టుకోవచ్చనీ రాసి తప్పించాడు.

సీతకి నెలలు నిండాయి. ఆ వేళ సాయంత్రం చల్లగాలికి గుమ్మానికడ్డంగా చాప వేసుకుని పడుకుంది. ఎదిరింట్లో ఆడుకుంటున్న రవణకి వారి అబ్బాయితో తగాదా వచ్చింది. ఆ అబ్బా యెక్కడ కొడతాడో అన్న భయంతో పరుగెత్తుకుంటూ వస్తున్న రవణకి, గుమ్మానికి అడ్డంగా తల్లి కనిపిస్తే, పరుగు ఆపుకోబోయి, ఆ ఊపుకి ఆమె మీద పడిపోయాడు.

"అమ్మో!" అని ఒక్క కేక పెట్టింది సీత, హడిలిపోయి గభాల్న లేచాడు రవణ. కోపం పట్టలేకపోయింది. కర్ర పట్టుకుని బాగా బాది వదిలింది వాణ్ణి. ఆమె కడుపులో సన్నగా పోట్లు రావడం మొదలు పెట్టాయి. కర్ర అక్కడ పారేసి మూలుగుతూ వెళ్లి పడుకుంది. ఇంతలో రాజారావు వచ్చాడు. భర్త రావటం చూసి మూలుగు మరింత హెచ్చించింది సీత. గాభరాగా ఏమిటని అడిగాడు. మూలుగుతూనే జరిగిందంతా చెప్పింది. పోట్లు వస్తున్నాయనగానే సీత కేమవుతుందోనని విపరీతంగా భయపడ్డారు రాజావావు. దీనికంటూ కారణమైన రవణని చూడగానే అతనికి ఆగ్రహం ముంచుకువచ్చింది.

రూళ్లకర్ర పుచ్చుకుని ఉగ్రుడైతన ఎదురుగా నించున్న తండ్రిని చూస్తూ రవణ బిక్కచచ్చి పక్కకీ ఒదిగాడు. ఆ వేళకి అతనికి రవణ మీద ఉన్న ఆపేక్ష అంతా ఏమయిందో మరి? ఒళ్లూ పై తెలియకుండా రవణను కొట్టాడు రాజారావు.ఆ దెబ్బలు తట్టుకోలేక ఏడుస్తూ కింద పడి ఉంగలు చుట్టుకుపోయాడు రవణ.

వాడేమయిందీ చూడకుండా హడావిడిగా డాక్టర్ కోసం పరిగెత్తాడు రాజారావు.

డాక్టర్ వచ్చి సీతను పరీక్షచేసి, 'మరేమీ ఫరవాలే' దని ఇంజక్షనిచ్చి వెళ్లి పోయాడు. అప్పటికి స్తిమితపడ్డాడు రాజారావు. కాస్సేపు మూలిగి నిద్రపోయింది సీత.

ఆ రాత్రి రవణేమయింది ఎవరూ పట్టించుకోలేదు.

ఏడ్చి ఏడ్చి, అలిసి పడుకున్న రవణకి ఒక రాత్రవేళ మెలుకువ వచ్చింది. ఒళ్లంతా దెబ్బలతో పులిసిపోయిదేమో విపరీతంగా మూలగసాగాడు. ఆ మూలుగుకి మెలుకువ వచ్చిన రాజారావు సీత లేస్తుందేమో నన్న భయం మూలాన నింపాదిగా రవణ దగ్గిరికి వెళ్లి, "నోరెత్తితే చంపేస్తాను. నోరు మూసుకు పడుకో!" అని గద్దించాడు.మరి మూలగలేదు రవణ.

తిరిగి వచ్చి పడుకున్నాడు రాజారావు.

అర్ధరాత్రి అయింది. రాజారావు మాగన్ను నిద్రలో ఉన్నాడు. పక్క గదిలో ఎవరో ఏడుస్తున్నట్టు వినిపించింది. మంచం దిగి మెల్లిగా ఆ గదిలోకి వెళ్లాడు.

దోమతెరలో ఒక మాంసంముద్దలా పడి ఉన్నాడు రవణ. 'జీరోబల్బు' నన్నని వెలుగులో ఎవరో ఒకామె మంచంపట్టి ఆనుకుని కూచుని రవణని ఒళ్లో పెట్టుకుని మెల్లిగా రోదిస్తూంది. ఎవ రామె?

"దుర్మార్గులు! గోడ్డును బాదినట్టు బాదారు. ఎలా చేతులు వచ్చాయి వాళ్లకీ?" శూన్యంలో మోగింది ఒక గద్గదకంఠం.

"ఎవరు నువ్వు!" గుమ్మంలో ఆగిగద్దించి అడిగాడు రాజారావు. కాళ్లాడలేదతనికి.

రవణ ఏదో కంప మెచ్చినట్టయి

విలువంపులు తిరిగిపోతున్నాడు ఆమె ఒడిలో.

"నే నెవరినా? చెబితే జ్ఞాపకానికి వస్తుందా? నా కిచ్చిన మాట గుర్తుకు వస్తుందా?"

మళ్లీ అదే కంఠం! మూడేళ్ల మరుపుల మడతలలోనించీ ఒక తియ్యని గొంతులోని మార్దవం, ఆత్మీయమైన ఒకానొక వెలుగు గూడు కట్టినట్టయి, ఒక రేఖాచిత్రంలా తళుక్కుమంది రాజారావు ముందు.

"ఎందుకువచ్చాననా బిత్తరపోతున్నారు? ఈ నరకంలో నించీ మీ రాక్షస హస్తాలలోనించీ నా బిడ్డని నా ప్రపంచలోకి తీసుకుపోతున్నాను."

రవణని భుజంమీద కెత్తుకుని, గిరుక్కున తిరిగి చురుక్కున చూసిందామె.

ఆమె సరళ!

"ఆగు- ఆగు" అని పరిగెట్టే సందున ఆ రెండు మూర్తులూ కొండపల్లి బొమ్మలంత సైజుల్లోకి కుదించుకుపోయి గోడనున్న సరళ ఫోటో చట్రంలోకి దూసుకుపోయినాయి.

"సరళా- సరళా" అంటూ మంచం కోడు తగ్గిలి పడిపోయాడు రాజారావు. ఒళ్లంతా చెమటలు వట్టింది. దోమతెర మాయమయింది. లేచి గుట్టూ చూశాడు. పక్క మంచంమీద సీత గాఢంగా నిద్ర పోతూంది.

అయితే ఇదంతా కలన్న మాట.

రవణని నిజంగా తీసుకెళ్లలేదు గదా సరళ? అతని గుండె గుబగుబలాడింది. తన పిచ్చిగాని కలలో కనిపించిన సరళ రవణ నెలా తీసుకెడుతుంది?

అయినా అనుమానం తీర్చుకోడానికి మంచం దిగి రవణ గదిలోకి వెళ్లాడు. రాత్రి పడుకున్న చోటనే ముడుచుకుని నిద్ర పోతున్నాడు. రవణ. గుండె కుదుట పడింది రాజారావుకి. రాత్రి తాను కొట్టిన దెబ్బలకి నొచ్చుకున్నాడు. అప్పుడేదో రాక్షసి ఆవహించింది తనని. రవణ మీద ప్రేమ పొంగుకొచ్చింది. ఇకనించీ రవణని, ఎవరేమనుకోనీ జాగ్రత్తగా చూసుకోవాలి. నెమ్మదిగా వాడి పక్కన కూర్చుని ఒంటిమీద చెయ్యి వేశాడు.

చల్లగామంచుముద్దలా చేతికి తగిలింది.

"రవణా!" కెవ్వున కేక పెట్టాడు రాజారావు. ●